ప్రజాశక్తి
సోమవారం 30 జనవరి 2023
5
పార్వతీపురం మన్యం

31న జాబ్‌మేళా

ప్రజాశక్తి- కలెక్టరేట్

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, బి.ఫార్మసీలో ఉత్తీర్ణత సాధించిన నిరుద్యోగ యువతీ యువకులకు ఈనెల 31న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్య అభివద్ధి అధికారి యు. సాయికుమార్ తెలిపారు. మంగళవారం ఉదయం 10 గంటల నుంచి శ్రీవెంకటేశ్వర గవర్నమెంట్ డిగ్రీ కాలేజీలో నిర్వహించే ఈ జాబ్ మేళాకు 18ఏళ్ల నుంచి 30 ఏళ్ల మధ్య వారు హాజరు కావచ్చునని పేర్కొన్నారు. జయభేరి ఆటో మొబైల్స్, అపోలో ఫార్మాసి కంపెనీ ప్రతినిధులు హాజరైన అభ్యర్థులను ఎంపిక చేస్తారని తెలిపారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీ యువకులు తమ వివరాలను www.apss-dc.in వెబ్‌సైట్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకొని, రిఫరెన్స్ నెంబర్ తో పాటుగా ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికేట్లు ఒరిజినల్, జెరాక్స్ 1 పాస్‌పోర్టు సైజ్ ఫోటోతో ఉదయం 10 గంటలకు హాజరు కావాలని తెలిపారు.

అరటి రైతు కుదేలు

పొలాల్లోనే పండిపోతున్న అరటిగెలలు
తీసుకెళ్లని వ్యాపారులు
రైతులకు వరుస నష్టాలు

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

ఆర్థికంగా ఆదుకుంటుందని ఆశించిన అరటి రైతులకు నిరాశే మిగులుతోంది. వాణిజ్య పంటలు వేసుకుంటే ఆదాయం సమకూరుతుందన్న ఆశతో రైతాంగం అరటి పంట వైపు మొగ్గు చూపారు. ఈ ఏడాది అరటి దళారులు, మార్కెట్ శక్తులు ఏకమై రైతాంగానికి కన్నీరు మిగిల్చారు. వందలాది ఎకరాల్లో అరటి పంట చేతికొచ్చినా వ్యాపారం లేదంటూ అరటి పంటను తీసుకువెళ్లక పోవడంతో పొలాల్లోనే పండ్లు అయిపోయి కుళ్లిపోతున్నాయి. దీంతో పచ్చని అరటితో కళకళలాడే పంట నేడు పసుపుపచ్చగా మారిపోయింది.

జియ్యమ్మవలస మండలంలో 7వేల ఎకరాల్లో రైతులు అరటి సాగు చేశారు. పెదమేరంగి, గౌరమ్మపేట, కన్నపుదొరవలస, కుదమ, పరజపాడు, తురకనాయుడువలస, గెడ్డతిరువాడ పంచాయతీల పరిధిలో ఎక్కువగా అరటి సాగు చేస్తున్నారు. ఎకరాలో 1000 అరటి చెట్లు సాగవుతున్నాయి. గతంలో ఒక్కో గెలకు రూ.100 నుంచి రూ.120 వరకు దళారులు వ్యాపారులు రైతాంగానికి చెల్లిస్తూ ఉండేవారు. ఈ ఏడాది కూడా దళారులతో రైతాంగం ఒప్పందం కుదుర్చుకుంది. అయితే మార్కెట్లో వ్యాపారం జరగడం లేదంటూ దళారులు అరటి పంటను కోయకుండా అలాగే విడిచిపెట్టడంతో పొలాల్లోనే పంట పసుపుపచ్చగా మారి కుళ్ళిపోతోంది. కళ్లెదుటే పంట కుళ్లిపోతుండడంతో రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు.

వాణిజ్య పంటలను ప్రభుత్వం ప్రోత్సహిస్తుండడం, అరటి పంట ఆదాయాన్ని స్తుండడంతో ఎక్కువ మంది రైతులు అరటి పంట సాగుపైనే ఆసక్తి చూపుతున్నారు. పొలాల్లో సాగునీటి సౌకర్యం కోసం విద్యుత్ మోటార్లను ఏర్పాటు చేసుకొని వ్యవసాయాన్ని కొనసాగి

పొలాల్లోనే పండిపోతున్న అరటిగెలలు

స్తున్నారు. దీంతో మండలంలో అరటి సాగు ఎక్కువైంది. అరటి వ్యాపారులు ఇక్కడి నుంచి ఒడిశా, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర, చత్తీసఘడ్ రాష్ట్రాలతో పాటు ఆంధ్రప్రదేశ్‌లో వివిధ జిల్లాలకు తరలిస్తూ అమ్మకాలు సాగిస్తుంటారు. ఈ ఏడాది ఏమైందో కానీ రెండు నెలల క్రితం అరటి గెలలు కోయాల్సి ఉండగా ఎక్కడా వ్యాపారులు కన్నెత్తి కూడా చూడలేదు. రైతులు ఆ వ్యాపారులను ప్రశ్నిస్తే మార్కెట్లో అరటి వ్యాపారం జరగడంలేదని, ఆయా రాష్ట్రాల్లో వ్యాపారం మందగించిందని, అరటి గెలలు కోయలేమని తెగేసి చెప్పేస్తున్నారు. దీంతో రైతాంగం దిక్కుతోచని పరిస్థితులను ఎదుర్కొంటూ తమ పంటను ఏం చేసుకోవాలో తెలియని స్థితిలో కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. సాగునీటి కోసం బోర్లు తీయడానికి లక్షల రూపాయలు ఖర్చు చేశామని, అప్పులు తీరుతాయన్న తరుణంలో ఇలా ఇబ్బందులు పడుతున్నామని రైతులు వాపోతున్నారు. దీంతో అరటి పంట రైతాంగానికి ఈ ఏడాది నిరాశ నిస్పృహలతో పాటు కన్నీటిని మిగిల్చింది. ఒక్కో ఎకరాకు లక్ష రూపాయలకు పైబడి పెట్టుబడి పెట్టగా, ఎవరూ కొనుగోలు చేయక పోవడంతో ఆ అప్పులు తీర్చలేమని రైతులు అంటున్నారు.

కన్నీరే మిగిలింది..

అరటి పంట ఆదుకుంటుందని ఆశించాం. ఏడాదంతా కష్టపడి పండించిన పంట మట్టిలో కలిసిపోయింది. గత ఆరేళ్ల నుంచి అరటి పంటను పండిస్తున్నాను. ఎప్పుడూ కూడా ఇంత నరకం చూడలేదు. ఆదాయం వస్తుందన్న ఆశతో ఉన్న పొలమంతా అరటి వేసి పంట పండిందనుకున్న సమయంలో వ్యాపారులు కోయకపోవడంతో పూర్తిగా నష్టపోయాం. లక్షల్లో రావాల్సిన ఆదాయం పూర్తిగా పోవడంతో వ్యవసాయ పెట్టుబడులకు పెట్టిన డబ్బు అప్పుగానే మిగిలి పోయింది. **– గురుకు నాగేశ్వరరావు, పెదమేరంగి**

రోడ్డు పక్కన అరటిగెలలు అమ్ముతున్న రైతు వెంకటనాయుడు

వ్యాపారులు గెలలు తీసుకెళ్లడం లేదు

రెండు ఎకరాల్లో అరటి పంటను వేశాను. వాణిజ్య పంట వేస్తే ఆదాయం వస్తుందని ఆశించి ఈ ఏడాది అరటి పండించాను. మార్కెట్లో వ్యాపారం లేదంటూ గెలలను కోయడం లేదు. దీంతో గెలలన్నీ పండిపోయాయి. గెలలు కొట్టకపోవడంతో ఎంతో కొంత వస్తుందని మేమే వాటిని కొట్టి రోడ్డుపై పెడుతున్నాం. అయినా కొనేవారు కానరావడం లేదు. వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టాను. గెలలు తీసుకువెళ్లకపోవడంతో అప్పులే మిగిలాయి

మరడాన వెంకటనాయుడు, రైతు, గవరమ్మపేట

ఘనసర సమీపంలో సంచరిస్తున్న ఏనుగులు

ఏనుగుల కదలికలపై నిఘా

ప్రజాశక్తి -భామిని

భామిని మండలంలో గత మూడున్నరేళ్లగా పలు గ్రామాల్లో పంటలు నాశనం చేయడం, ఇటీవల చేతికొచ్చిన మొక్క జొన్న, అరటి, చెరకు, కల్లాల్లో ధాన్యం నాశనం చేసి ఒక రైతు తీవ్రంగా వ్యక్తిని దాడి చేసి చంపిన నాలుగు ఏనుగుల గుంపుపై ఫారెస్టు అధికారులు నిఘా పెట్టారు. ఫారెస్ట్ రేంజ్ అధికారి కె. తవిటి నాయుడు ఆధ్వర్యంలో ఏనుగుల గుంపును 10 రోజుల క్రితం మైదాన గ్రామాలైన కీసర, కొసలి, ఘనసర, తలడా నుండి ఎగువ కొండ ప్రాంతాలకు జిల్లా అటవీ శేఖ సిబ్బంది మంది, ఎలిఫెంట్ ట్రాకర్స్ చాక చక్యంగా గుంపును తరలించారు. ప్రస్తుతం ఏనుగులు సంచరిస్తున్న కొండ ఎగువప్రాంతాలైన రేగిడి, ఆవిరి, తిత్తిరి, ఈతమణుగూడ నుండి మైదాన ప్రాంతాలకు రావటానికి అడ్డంగా వంశధార కుడి కాలువ ఉంది. దీంతో అవి కెనాల్ బ్రిడ్జి ద్వారా మైదాన ప్రాంతానికి రావటానికి అవకాశం ఉండటంతో 30 మంది బృందాలుగా ఏర్పడి రాత్రిపూట మంటలు వేసుకొని నిఘా ఉంటున్నారు. ఏనుగులు

గ్రామాల్లోకి రాకుండా మంటలు వేస్తున్న అటవీశాఖ సిబ్బంది

సంచరించే రేగిడి, ఈతమానుగూడ, ఆవిరి, తిత్తిరి, కొండ ప్రాంతాల్లో పోడు వ్యవసాయం చేసే రైతులను నిరంతరం అప్రమత్తం చేస్తున్నామని, స్థానికుల సహాయంతో ఏనుగుల కదలికపై ట్రాకర్స్ ద్వారా నిరంతరం నిఘా పెడుతున్నామని, ఏనుగులు మైదాన ప్రాంతాలకు వెళ్లే కెనాల్ బ్రిడ్జి మార్గాలను పూర్తిగా సిబ్బంది తో లాక్ చేశామని, ఏనుగుల కదలికలు పరిశీలనకు వచ్చిన ఫారెస్ట్ రేంజ్ అధికారి కె. తవిటి నాయుడు తెలిపారు. నిఘా విభాగంలో కార్యక్రమం ఫారెస్ట్ సెక్షన్ అధికారి హరికృష్ణ, ఫారెస్ట్ బీట్ అధికారి లక్ష్మి నారాయణ, ఫారెస్ట్ సిబ్బంది వున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి

సమస్యల పరిష్కారానికి చర్యలు : ఎమ్మెల్యే

ప్రజాశకి-పార్వతీపురంరూరల్

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు వీలవుతుందని ఎమ్మెల్యే అలజంగి జోగారావు తెలిపారు. ఆదివారం పార్వతీపురం మండలం పుట్టూరు సచివాలయం పరిధిలోని లచ్చిరాజుపేట గ్రామంలో వరుసగా నాలగవరోజు చేపట్టిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. సంక్షేమ పథకాల అమలుతో పాటు, సచివాలయాలకు కేటాయించిన ప్రత్యేక నిధుల ద్వారా గ్రామలలో చిరకాలంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం, అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాదికి నీటి ఎద్దడి లేకుండా జెజెఎం పథకం ద్వారా ఇంటింటికీ తాగునీరు అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ గుంట్రెడ్డి సతీష్‌కుమార్, ఎంపిటిటి వై.లక్ష్మి, జెడ్‌పిటిసి బలగరేవతమ్మ, ఎంపిపి మజ్జి శోభారాణి, వైస్ ఎంపిపి సిద్ధ జగన్నాధ రావు, పూడి శంకర్రావు, ఎఎంసి చైర్‌పర్సన్ ఎం.బాగ్యశ్రీ, మండల పార్టీ అధ్యక్షులు బొమ్మి రమేష్, ఆత్మ చైర్మన్ వై.తిరుపతిరావు, సర్పంచ్‌లు, ఎంపిటిసి సభ్యులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

మహిళలతో మాట్లాడుతున్న టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసాదరావు

ప్రజల చెంతకే సంక్షేమ ఫలాలు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ప్రజల చెంతకే నేరుగా ప్రభుత్వ సంక్షేమ ఫలాలను అందిస్తున్నామని టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ అన్నారు. ఆదివారం పట్టణంలోని 6వ వార్డులో ఆయన పర్యటించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నవరత్నాలు పథకం అమలులో భాగంగా ప్రజలకు అందుతున్న పలు సంక్షేమ పథకాలు గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. డ్వాక్రా మహిళలకు సున్నా వడ్డీ కింద ఇస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలని సూచించారు. అక్కడ నిర్వహిస్తున్న అప్పడాల తయారీ, చేపల వ్యాపారం, నువ్వులు శుద్ధి చేస్తున్న వివిధ డ్వాక్రా సంఘల సభ్యులకు అభినందనలు తెలియజేస్తూ, ఇతర డ్వాక్రా సభ్యులకు ఇటువంటివి తయారు చేయడంలో శిక్షణ ఇప్పిస్తుందని తెలిపారు. నిరుపేదలకు ఇళ్ల నిర్మాణం, టిడ్కో హౌసింగ్‌పై అవగాహన కల్పిస్తూ పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. ఆయన వెంట వార్డు కౌన్సిలర్ మజ్జి పారినాయుడు, పైదాప నాయుడు, రమణయ్య, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

తోటపల్లి దేవస్థానానికి పూర్తి సహకారం

ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

ప్రజాశక్తి - కురుపాం

ప్రభుత్వపరంగా తోటపల్లి దేవస్థానానికి పూర్తి సహకారం అందిస్తామని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. ఆదివారం తోటపల్లి దేవస్థానం వద్ద నిర్వహించిన దేవస్థాన అభివృద్ధి కమిటీ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గొప్ప ఆలయాన్ని పునర్ వ్యవస్థీకరణ చేయాలని వందలాదిమంది సంకల్పించి, ముందుకు రావడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం 60 ఏళ్ల క్రితం దేవాలయ నిర్మాణంలో కృషి చేసిన 100 మంది దాతలను, 101 సంవత్సరాలు పూర్తి చేసుకున్న రొక్కం సత్యనారాయణను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మేనేజింగ్ ట్రస్టీ డైరెక్టర్ డి.ధనుంజయరావు, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బాపూజీ నాయుడు, మండలాధ్యక్షులు ఉరిటి రామారావు, సర్పంచులు ఆవాల సింహాచలమమ్మ, అంబటి రాంబాబు, ఎంపిటిసిలు మరడాన సింహాచలం, శ్రీనివాసరావు, గోపాల్‌పూర్ పోర్ట్ సిఇఒ జనార్ధనరావు, జట్టు సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ డి. పారినాయుడు తదితరులు పాల్గొన్నారు.

పర్యవేక్షణ పేరుతో సస్పెండ్ చేస్తే ఉద్యమిస్తాం : యుటిఎఫ్

ప్రజాశక్తి-కలెక్టరేట్

ఉపాధ్యాయులు లక్షలాది రూపాయలు జీతం తీసుకొని సక్రమంగా పనిచేయడం లేదని, నేనే యూట్యూబ్ లో పాఠాలు చెబుతానని విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ అనడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మురళీమోహన్‌రావు అన్నారు. ప్రతి చిన్న తప్పునూ పెద్దగా చిత్రీకరించి సమాజంలో ఉపాధ్యాయులను కించపర్చేలా ఆయన వ్యాఖ్యలు ఉంటున్నాయని అన్నారు. ఉపాధ్యాయులను వేధించి విద్యారంగాన్ని సంస్కరించడం సాధ్యం కాదని పేర్కొన్నారు. ఉపాధ్యాయులకు బోధనేతర కార్యక్రమాలు రద్దు చేసి, అకడమిక్ అంశాలకు మాత్రమే పరిమితం చేయాలని అన్నారు. విద్యారంగంలో విధ్వంసకర విధానాలను విడనాడి, ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి మెరుగైన విదానాలను అనుసరించాలని కోరారు. టెన్త్ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేస్తున్న తరుణంలో సరైన కారణాలు లేకుండా పర్యవేక్షణ పేరుతో ఉపాధ్యాయులను సస్పెండ్ చేస్తే అందరం కలిసి ఉద్యమిస్తామని తెలిపారు.

2 నుంచి మహాలక్ష్మి పేరంటాలు వార్షికోత్సవం

ప్రజాశక్తి-వీరఘట్టాం

మండలం పరిధి తెట్టంగి గ్రామంలో 46వ వార్షికోత్సవంలో భాగంగా ఫిబ్రవరి 2 నుంచి మహాలక్ష్మి పేరంటాలు కార్యక్రమం నిర్వహించినట్లు ఆలయ నిర్వాహకులు గుజ్జల నారాయణరావు తెలిపారు. ఆరోజు ఉదయం కుంకుమ పూజ, సాయంత్రం భజన కార్యక్రమం, రాత్రి శ్రీ విజయ దుర్గ కళా నాట్య మండలి వారితో శ్రీకృష్ణార్జున యుద్ధం, శ్రీ భగవతి నృత్య కళామందిర్ వారిచే జ్ఞానపద నృత్య ప్రదర్శన కార్యక్రమం నిర్వహించనున్నట్లు నారాయణరావు తెలిపారు. 3న ముగ్గులు పోటీలు, సాంస్కృతిక, క్విజ్ పోటీలు నిర్వహిస్తామన్నారు. అదేరోజు రాత్రి లక్ష్మణ డాన్స్ గ్రూప్‌తో డాన్స్ బేబీ డాన్స్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. 4న నిత్య పూజలతో పాటు 200 మంది నిరుపేదలకు వస్త్ర దానం చేస్తామని తెలిపారు.

హైడ్రామా నడుమ పోస్టుమార్టం

కమిషనర్ హామీ ఆలస్యంతో బంధువుల ఆందోళన

పోలీస్‌స్టేషన్ ముందు ఆందోళన చేస్తున్న శ్రావణ్ బంధువులు, కుటుంబ సభ్యులు

ప్రజాశక్తి-పాలకొండ/పాలకొండ రూరల్

ఈ నెల 28న పట్టణంలో స్టేట్‌బ్యాంకు వద్ద నగర పంచాయతీ వాటర్ ట్యాంకర్ ఢీకొని కొండవీధికి చెందిన శ్రావణ్ మృతిచెందిన విషయం తెలిసిందే. అయితే ఆదివారం పోస్టుమార్టం నిర్వహించడంలో హైడ్రామా కొనసాగింది. తీవ్ర ఉద్రిక్త పరిస్థితుల మధ్య సాయంత్రం 4.30 గంటలకు పోస్టుమార్టం నిర్వహించారు. ముందుగా ఉదయం శ్రావణ్ భార్య, తల్లి, బంధువులు ఏరియా ఆస్పత్రికి చేరుకుని తమకు న్యాయం చేసే వరకు పోస్టుమార్టం నిర్వహించవద్దని పట్టుబట్టారు. దీంతో ఎస్ఐ శివప్రసాద్ పోలీస్‌స్టేషన్‌లో ఉదయం నుంచి చర్చలు జరిపారు. విశ్రాంత కమిషనర్ లిల్లీపుష్పనాథం, వార్డు నాయకులు ఆకుల కుమార్, తదితరులతో మాట్లాడారు. శ్రావణ్ మృతితో ఆ కుటుంబం రోడ్డున పడిందని, రెండేళ్ల పాప ఉందని, మృతుడి భార్య ప్రవల్లికకు నగర పంచాయతీలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగం కల్పించాలని వారు డిమాండ్ చేశారు. దీనిపై కమిషనర్ సర్వేశ్వరరావు అందుబాటులో లేకపోవడంతో ఫోన్‌లో మాట్లాడారు. నగర పంచాయతీ ట్రాక్టర్ ఢీకొనడంతో బాధ్యత వహించి, మానవీయ కోణంలో ఆలోచించి ఉపాధి కల్పించాలని పట్టుబట్టారు. దీనిపై కమిషనర్ స్పందించి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తానని చెప్పారు. ఈ విషయంపై లిఖిత పూర్వకంగా తమకు హామీ ఇవ్వాలని, అప్పుడే పోస్టుమార్టం జరుగుతుందని చెప్పారు. దీనికి కమిషనర్ అంగీకరించలేదు. డిఎస్‌పి జి.వి.కృష్ణారావు జోక్యం చేసుకుని మృతుడి బంధువులు, పెద్దలతో మాట్లాడారు. ఆ కుటుంబానికి న్యాయం చేస్తామని చెప్పారు. కమిషనర్‌తో మాట్లాడి ఉద్యోగం ఇప్పిస్తామని లిఖిత పూర్వకంగా అంగీకార పత్రం ఇవ్వాలని సూచించారు. అయితే ఇన్‌ఛార్జి మేనేజర్ నాయుడు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ దేవ్ కమిషనర్‌తో ఫోన్‌లో మాట్లాడి ఇక్కడ పరిస్థితిని వివరించారు. సాయంత్రం వరకు కమిషనర్ లిఖితపూర్వకంగా ఇవ్వకపోవడంతో బంధువులు పోలీస్‌స్టేషన్ ఎదుట బైఠాయించారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కమిషనర్, ఎఇపై కేసులు నమోదు చేయాలని పట్టుబట్టారు. దీంతో కమిషనర్ ఇన్‌ఛార్జి మేనేజర్‌కు లిఖితపూర్వకంగా రాసి ఇవ్వాలని ఆదేశించారు. వెంటనే ఆ పత్రాన్ని డిఎస్‌పికి అందజేశారు. శ్రావణ్ కుటుంబ సభ్యులకు డిఎస్‌పి ఆ పత్రం అందించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని, ఎవరూ అధైర్యపడొద్దని చెప్పారు.

నిఘా నీడలో ఇంటర్ పరీక్షలు

ఇంటర్‌మీడియట్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశామని ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి ఎం.సత్యనారాయణ తెలిపారు. ఈ ఏడాది అన్ని పరీక్షా కేంద్రాల వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు చేశామని, నిఘా నీడలోనే పరీక్షలు జరగనున్నాయని వెల్లడించారు. ఈ వారం 'ప్రజాశక్తి'కి ఆయన ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఇంటర్మీడియట్ పరీక్షలు మార్చి 26 నుంచి నిర్వహిస్తుండటంతో పరీక్షల నిర్వహణకు తీసుకున్న చర్యలను ఆయన వివరించారు. ఆ వివరాలు..

– ప్రజాశక్తి, విజయనగరంటౌన్

- అన్ని కేంద్రాల్లోనూ సిసి కెమెరాలు
- 77 కేంద్రాల్లో పరీక్షలు
- 152 కేంద్రాల్లో ప్రాక్టికల్స్
- 'ప్రజాశక్తి'తో ఆర్ఐఒ ఎం.సత్యనారాయణ ముఖాముఖి





? పరీక్షలు ఎప్పటినుంచి జరగనున్నాయి?.

ఇంటర్‌మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సర పరీక్షలు మార్చి 26 నుంచి ఏప్రిల్ నాలుగో తేది వరకు జరగనున్నాయి. ప్రాక్టిక్ పరీక్షలు ఫిబ్రవరి 20 నుంచి మార్చి ఏడో తేది వరకు జరగనున్నాయి. ఈ పరీక్షలు రాయాలంటే ముందుగా ఫిబ్రవరి 15, 17న జరిగే మానవతా విలువలు, పర్యావరణ విద్య పరీక్షలు రాయాలి. ఈ రెండు పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారు మాత్రమే మెయిన్ పరీక్షలకు అర్హత సాధిస్తారు. ప్రతి విద్యార్థి ఈ రెండు పరీక్షలు తప్పనిసరిగా రాయాల్సి ఉంది.

? ఇంటర్ పరీక్షలు ఎన్ని కేంద్రాల్లో జరగనున్నాయి? వాటిలో సమస్యాత్మక కేంద్రాలను ఎన్నింటిని గుర్తించారు?.

జిల్లాలో ఇంటర్‌మీడియట్ థియరీ పరీక్షలు 77 కేంద్రాల్లో జరగనున్నాయి. ప్రాక్టికల్ పరీక్షలు 152 కేంద్రాల్లో నిర్వహిస్తున్నాం. ప్రాక్టికల్ పరీక్షలు సెల్ఫ్ కేంద్రాల్లో ఏర్పాటు చేశాం. థియరీ పరీక్షలు 77 కేంద్రాలకు గాను 41 ప్రయివేటు, 36 ప్రభుత్వ యాజమాన్యాల్లో ఉన్న కళాశాలల్లో జరగనున్నాయి. ఎటువంటి సమస్యాత్మక కేంద్రాలూ లేవు.

? ఈ ఏడాది ఎంత మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు?.

ఈ ఏడాది ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షకు జనరల్ విద్యార్థులు 18,742 మంది, ఒకేషనల్ విద్యార్థులు 5,726 మంది హాజరుకానున్నారు. ద్వితీయ ఇంటర్‌లో జనరల్ విద్యార్థులు 18,719 మంది, ఒకేషనల్ విద్యార్థులు 4289 మంది పరీక్షలు రాయనున్నారు. జిల్లాలో 106 ప్రయివేటు కళాశాలలు, 35 ఒకేషనల్ కళాశాలలతోపాటు 96 ప్రభుత్వ విద్యాసంస్థల నుంచి విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు.

? విద్యార్థులను ఏవిధంగా సన్నద్ధం చేస్తున్నారు?.

సంక్రాంతి పండగ నాటికే ఇంటర్‌మీడియట్ సిలబస్ పూర్తి చేశారు. విద్యార్థులను పరీక్షలకు ఇప్పటికే సన్నద్ధం చేసే ప్రక్రియ ప్రారంభించారు. పాఠ్యాంశాలు పూర్తయిన వెంటనే పరీక్ష నిర్వహించారు. వీటితోపాటు అదనపు తరగతులు, స్టడీఅవర్లు నిర్వహించి విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నారు. ఇప్పటికే స్టడీ మెటీరియల్‌ను అందించాం. విద్యార్థులకు అన్ని రకాలుగా పరీక్షలపై ఉండే భయం పోగొట్టేందుకు చర్యలు తీసుకున్నాం. ఈ నెలాఖరున ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహించనున్నారు.

? ఈ ఏడాది ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు తీసుకున్న చర్యలేమిటి?.

గతేడాది కేవలం 36 శాతం మాత్రమే ఫలితాలు వచ్చాయి. దాన్ని అధిగమించేందుకు ఈ ఏడాది 45 నుంచి 50 శాతం ఫలితాలు వచ్చే విధంగా అధ్యాపకులను సిద్ధం చేసి పాఠ్యాంశ బోధన చేయించాం. ప్రతీ విద్యార్థిపై అధ్యాపకుడు దృష్టి ఉండేలా ఈఏడాది చర్యలు తీసుకున్నాం. గతేడాది కంటే ఈసారి మెరుగైన ఫలితాలు వస్తాయని ఆశాభావంతో ఉన్నాం.

? పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు తీసుకున్న చర్యలేమిటి?.

ఇంటర్‌మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేలా అన్ని రకాల జాగ్రత్తలు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తీసుకున్నాం. పరీక్షా కేంద్రాల్లో ఫర్నీచర్, మరుగుదొడ్లు, లైటింగ్, తాగునీరు వంటి సౌకర్యాలు ఉండేలా చర్యలు చేపట్టాం. ఇప్పటికే అన్ని పరీక్షా కేంద్రాలను సందర్శించాం. పరీక్షకు వచ్చే విద్యార్థి సకాలంలో చేరుకునేలా రవాణా సౌకర్యం కల్పిస్తాం. ఆర్‌టిసి, పోలీసు, రెవెన్యూ, విద్యుత్, మున్సిపల్, వైద్య ఆరోగ్యశాఖల సహకారం తీసుకున్నాం. వారితో ఇప్పటికే సమావేశమయ్యాం.

? చూసి రాతలు అరికట్టేందుకు తీసుకున్న జాగ్రత్తలు ఏమిటి?

ఈఏడాది మాల్ ప్రాక్టీసుకు అవకాశం లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నాం. తనిఖీ బృందాలు ఉన్నప్పటికీ పరీక్షా కేంద్రాల వద్ద సిసి కెమెరాలను కూడా ఏర్పాటు చేశాం. చూసి రాతలకు అవకాశం లేదు. పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీసు భద్రత ఏర్పాటు చేయడంతోపాటు 144 సెక్షన్ అమల్లో ఉంటుంది.

ప్రజాశక్తి
www.prajasakti.com

ప్రభుత్వం చేపడుతున్న జగనన్న సమగ్ర భూ సర్వేతో ఖాతాదారుల సంఖ్య పెరుగుతోంది. ఆ మేరకు భూకమతాల విస్తీర్ణం తగ్గుతోంది. ప్రభుత్వ భూముల ఆక్రమణలు బయట పడుతున్నా ప్రస్తుతానికి అవన్నీ రికార్డుల్లో నమోదుకే పరిమితమౌతున్నాయి. జగనన్న శాశ్వత భూ హక్కు పేరిట జిల్లాలో సుమారు ఏడాది కాలంగా రీసర్వే చేపడుతున్న విషయం విదితమే. తగినంత మంది సిబ్బంది లేకపోవడం, సాంకేతిక సమస్యలు వంటి కారణాలతో రీసర్వే నత్తనడకన సాగుతోంది.

రీ సర్వేతో పెరుగుతున్న ఖాతాలు

- తగ్గుతున్న భూకమతాల విస్తీర్ణం
- రికార్డులకే పరిమితమైన ఆక్రమణల గుర్తింపు

ప్రజాశక్తి-విజయనగరం ప్రతినిధి

జిల్లా వ్యాప్తంగా 983 రెవెన్యూ గ్రామాలు ఉండగా, 807 గ్రామాల్లో 2,796.70 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో డ్రోన్ సర్వే పూర్తయింది. మొదటి దశలో 179 గ్రామాల్లో 84,327 ఎకరాల భూమిలో రీసర్వే పూర్తి చేసినట్టుగా అధికారులు చెబుతున్నారు. ఈ గ్రామాల్లో పూర్వం 50,299 భూమి ఖాతాలు ఉండగా, తాజా సర్వేతో ఈ సంఖ్య 61,751కి పెరిగింది. సబ్‌డివిజన్లు కూడా 92,541 నుంచి 1,94,606కి పెరిగాయి. దీన్ని బట్టి ఆ మేరకు భూ కమతాల విస్తీర్ణం తగ్గుముఖం పట్టినట్టుగా స్పష్టమౌతోంది. పెరిగిన జనాభా, అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ల పంపకాలే ఇందుకు కారణమని రెవెన్యూ అధికారులు విశ్లేషిస్తున్నారు.

పెరిగిన చిన్న కమతాలు

ఖాతాలు, సబ్ డివిజన్ల సంఖ్య పెరగడం వల్ల ఖాతాదారులకు నష్టాలు లేకున్నా, కమతాల విస్తీర్ణం తగ్గుముఖం పట్టడం వల్ల గట్ల రూపంలో కొంత భూమి వృథా కావడం అనివార్యమని పలువురు అభిప్రాయ పడుతున్నారు. మన జిల్లాలో చిన్న, సన్నకారు రైతులే అధికం. ఎకరా నుంచి మూడెకరాలలోపు ఉన్నవారే ఎక్కువ మంది. అది కూడా నాలుగు దిక్కుల్లో ఉంటున్నాయి. దీనివల్ల చిన్నకమతాలను ఆధునిక యంత్రాలు, పనిముట్లతో వ్యవసాయం చేయలేని పరిస్థితి. ఇటువంటి తరుణంలో కమతాల విస్తీర్ణం మరింత తగ్గినట్టుగా స్పష్టం కావడంతో ఎక్కువ భూమి నాగలి, నక్కులతో సాగుచేయడమే అనుకూలమని, ట్రాక్టర్లు, ఉబాలు, కలుపు మొక్కలు తీసే యంత్రాలను ఉపయోగించడం మనలాంటి జిల్లాల్లో సాధ్యం కాదని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

సిబ్బందిపై పనిభారం

సర్వే పేరిట అధికార యంత్రాంగం హడావుడి చేస్తున్నప్పటికీ, అదనపు సిబ్బంది లేకపోవడం వల్ల ఉన్నవారిపైనే పనిభారం పడుతోంది. చాలాచోట్ల నత్తనడకన సాగుతోంది. సర్వేను వేగవంతం చేయాలంటూ ప్రభుత్వం నుంచి ఒత్తిడి రావడంతో తహశీల్దార్, విఆర్ఒ, విఆర్ఎ, సర్వేయర్లు ఎలాగోలా పూర్తిచేయాలన్న నిర్ణయానికి వస్తున్నారు. ఇదే పరిస్థితి ఏర్పడితే గతంలో వెబ్‌ల్యాండ్‌లో జరిగిన తప్పిదాలే పునరావృతమయ్యే ప్రమాదం కనిపిస్తోంది. అప్పట్లో ఒకరి భూమి, మరొకరి పేరున ఆన్‌లైన్ చేయడం వల్ల ఇప్పటికీ రైతులు, భూమి యజమానులు అనేక పాట్లు పడుతున్నారు. అందులోనూ ఇది ఉన్న పరిస్థితిని యథాతథంగా రికార్డు చేసే పనికాదు. రీ సర్వేలో ఎన్ని క్రయవిక్రయాలు జరిగినా ప్రస్తుత యజమాని పేరిట రికార్డు కావాలి. పాస్‌పుస్తకాలు కూడా జారీ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రీసర్వే ఆదరాబాదరాగా చేపడితే భూ యజమానులు నష్టపోయే ప్రమాదం కనిపిస్తోందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కబ్జాలు గుర్తించినా..

రీసర్వేలో ప్రభుత్వ భూములు, చెరువులు, గోర్జులు.. చాలా చోట్ల కబ్జాలకు గురైనట్టు గుర్తించినా, వాటిని రికార్డుల్లో నమోదు చేయడం తప్ప ఆక్రమణలు తొలగించే పని జరగడం లేదు. సర్వే, ఆక్రమణల తొలగింపు ఏకకాలంలో చేపట్టక పోవడం పట్ల అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. చిత్తశుద్ధి ఉంటే ఆక్రమణల వివరాలను కనీసం గ్రామాల్లో ప్రదర్శించాలని పలువురు చెబుతున్నారు. రాజకీయంగా బలమున్నవారు అనుభవిస్తారని, లేదంటే సాగు భూములకు సైతం దూరమయ్యే పరిస్థితి కనిపిస్తోందని పలువురు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆశ్రమ పాఠశాల

సిబ్బంది లేక ఇబ్బందులు

ప్రజాశక్తి-సీతంపేట

ఐటిడిఎ పరిధిలో ఆశ్రమ పాఠశాలల్లో నాలుగో తరగతి సిబ్బంది లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. సంక్షేమ అధికారులకు కూడా అవస్థలు తప్పడం లేదు. సీతంపేట ఐటీడీఏ పరిధిలో 47 ఆశ్రమ పాఠశాలలు, 2 పోస్టు మెట్రిక్ వసతి గృహాలు, రెండు మినీ గురుకులాలు ఉన్నాయి. సుమారు 15వేల మంది విద్యార్థులు వీటిలో చదువుకుంటున్నారు. 16 పోస్టుమెట్రిక్ వసతి గృహాలకు, రెండు పోస్ట్ మెట్రిక్ వసతి గృహాలకు మాత్రమే నాలుగో తరగతి సిబ్బంది పోస్టు మంజూరు ఉంది. అయినప్పటికీ భర్తీ కాలేదు. మిగతా 14 పోస్టు మెట్రిక్ వసతి గృహాలకు కనీసం పోస్టులు కూడా మంజూరు చేయలేదు. కుక్, కమాటి, వాచ్‌మెన్ పోస్టులు భర్తీ కాకపోవడంతో విద్యార్థులతో పాటు సంక్షేమ అధికారులు కూడా ఇబ్బందులు పడుతున్నారు గత 25 సంవత్సరాలుగా ఈ పోస్టులు భర్తీ చేయలేదు. ప్రతి పాఠశాలలోను 100 మంది విద్యార్థులు దాటితే ఒక్కొక్కరు చొప్పున అదనగా సిబ్బందిని నియమించుకోవచ్చుననే నిబంధనలు ఉన్నాయి. కొన్ని పాఠశాలలో 500పైగా విద్యార్థులు ఉన్నారు. కానీ సిబ్బంది లేకపోవంతో వారికి భోజనాలు పెట్టడం ఇబ్బందిగా మారుతోంది.

అంత మంది విద్యార్థులకు ఒకరు లేక ఇద్దరు ఉంటే విద్యార్థులకు భోజనం సమయంలో వడ్డించడం సాధ్యం కాదు. విద్యార్థులకు అనుకున్న సమయానికి తరగతులకు వెళ్లడం కూడా సాధ్యం కావడం లేదు. ఒకవేళ ప్రైవేటు వ్యక్తులను పెడితే సంక్షేమ అధికారులకు చేతి చమురు తగులుతుంది. ఇప్పటికే ఆశ్రమ పాఠశాలలో నాలుగో తరగతి సిబ్బందిని నియమిం చాలని అనేకసార్లు ఉపాధ్యాయ సంఘాలు ధర్నాలు చేపట్టి అధికారులకు వినతులు కూడా సమర్పించారు. అయిన ఇంతవరకు ఎవరూ పట్టించుకోలేదు. దీనిపై గిరిజన సంక్షేమశాఖ ఉప సంచాలకులు బి.నగేష్‌ను వివరణ కోరగా ఇప్పటికే ప్రతిపాదనలు పంపించామని, ప్రభుత్వం దృష్టిలో ఉందని ఆమోదిస్తే భర్తీకి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

నాణ్యత లేకుండా రోడ్డు పనులు

ప్రజాశక్తి - కొమరాడ

నాణ్యత లేని రహదారులను నిర్మిస్తున్న కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని సీసాడవలస, బట్టి మొగల వలస గ్రామాల మధ్య వేసిన రహదారిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తారు రోడ్డు వేసిన నెల రోజులకే రహదారిపై పచ్చగడ్డి మొలకెత్తడం చూస్తుంటే నాణ్యత ఏమేరకు ఉందో అర్థమవుతోందన్నారు. సీసాడవలస మీదుగా బట్టి మానువలస గ్రామానికి వెళ్లే రహదారి మార్గాన తారు రోడ్డు వేసిన నెలరోజులకే అధ్వానంగా తయారైందని అన్నారు. నాణ్యతను పరిశీలించాల్సిన ఐటిడిఎ అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. వెంటనే కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పూడికతీతలను పరిశీలిస్తున్న అయ్యారకల కార్పొరేషన్ డైరెక్టర్ విజయచంద్రశేఖర్

కిచ్చాడలో కాలువ పూడిక తీతలు

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని కిచ్చాడ పంచాయతీ కిచ్చాడలోఆదివారం సర్పంచ్ గవర రాజ్యలక్ష్మి కాలువల్లో పూడికను తీయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలువలు పరిశుభ్రంగా ఉంటే మురికి నీరు నిల్వ ఉండకుండా, ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో అయ్యారకల కార్పొరేషన్ డైరెక్టర్ గవరవిజయ చంద్రశేఖర్ ,గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అభిషేక్‌ను అభినందిస్తున్న ప్రెస్‌క్లబ్ సభ్యులు

అభిషేక్ కుమార్‌కు సత్కారం

ప్రజాశక్తి-పాలకొండ రూరల్

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలో బంగారు పతకం సాధించిన అభిషేక్ కుమార్‌కు ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఘనంగా సన్మానించారు. అభిషేక్ కుమార్ జాతీయ స్థాయి పోటీల్లో కూడా విజయం సాధించాలని పలువురు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ గౌరవ అధ్యక్షులు కామేశ్వరరావు, అధ్యక్షులు గాంధీ, సభ్యులు ఉన్నారు.

రసవత్తరంగా క్రీడా పోటీలు

ప్రజాశక్తి - వేపాడ

వేపాడ, వల్లంపూడి జంట గ్రామాలలో పరదేశమ్మ- ముత్యాలమ్మ తీర్థ మహోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు శనివారం రాత్రి రసవత్తరంగా జరిగాయి. ఈ పోటీలలో 14 టీమ్‌లు పాల్గొనగా ఎస్‌కోటకు చెందిన టీమ్ మొదటి బహుమతిగా రూ. 5వేలు, వేపాడ టీమ్‌కు రెండో బహుమతిగా రూ.3వేలను కమిటీ సభ్యులు, సర్పంచ్ మెల్లిపాక అర్జునమ్మ, ఎంపిటిసి గాడి గంగ తల్లి, చేతుల మీదుగా అందించారు. అలాగే కుండల పోటీల్లో విజేతలకు కూడా బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఎడ్ల పరుగు పందేలు ఆకట్టుకున్నాయి. ఎడ్ల బళ్ల పరుగు విజేతలకు గ్రామ సర్పంచ్ ఎం అర్జునమ్మ, ఎంపిటిసి గంగ తల్లి, కమిటీ సభ్యులు చేతులు మీదుగా బహుమతులు ప్రదానం చేశారు.

మండలంలోని జాకీర్ గ్రామంలో ఆదివారం జరిగిన పైడమ్మ చిన్నమ్మలు పేరంటాలు, శ్రీ వీరాంజనేయ స్వామి 60వ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన గుర్రపు పరుగు పోటీలు హోరెత్తాయి. ఈ పోటీల్లో 11 మంది పాల్గొని తలబడ్డారు. విజేతలకు డిసిసి చైర్మన్ వివి చిన్న రామనాయుడు, గ్రామ సర్పంచ్ బుద్ధ చిన్నమ్మలు, గ్రామ పెద్ద బుద్ధ అప్పలనాయుడు, ఎంపిటిసి టివి రమణ, బుద్ధ కృష్ణ, ఉత్సవ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో బహుమతలును అందించారు. అనంతరం నిర్వహించిన సంగిడి రాళ్ల పోటీలు ఉర్రూతలూగించాయి.

3 నుంచి క్రికెట్ టోర్నమెంట్

ప్రజాశక్తి - కురుపాం

నియోజకవర్గ కేంద్రమైన కురుపాం సాయిరాం గుడి గ్రౌండ్‌లో ఫిబ్రవరి 3 తేదీ నుండి 6 వ తేదీ వరకు మెగా క్రికెట్ టోర్నీ నిర్వహిస్తున్నట్లు స్థానిక యువత డి.నవీన్, హిమానియల్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన్యం జిల్లా వైసిపి అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్ రాజు, ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి ఆధ్వర్యంలో మెగా క్రికెట్ టోర్నీ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. టోర్నీలో పాల్గొనవలసిన వారు ఎంట్రీ ఫీజు రూ.1599 రూపాయిలు చెల్లించాలని, విజేతలకు మొదటి బహుమతి రూ.30వేలు, ట్రోపీ, ద్వితీయ బహుమతి కింద రూ.20వేలు ట్రోపీ, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, మ్యాన్ ఆఫ్ ది సిరీస్, బెస్ట్ బ్యాట్స్‌మెన్, బెస్ట్ బౌలర్, బెస్ట్ ఫీల్డర్‌కు బహుమతులు అందజేస్తామని తెలిపారు. వివరాలకు 9491293317, 7993912193 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఆశాజనకంగా జీడిపూత

కొండంత ఆశతో గిరిజనం

ప్రజాశక్తి-కురుపాం

గిరిజన ప్రాంతంలో ప్రధాన పంటల్లో ఒకటైన జీడిపంట ఈ ఏడాది ఆశాజనకంగా ఉంది. దీంతో గిరిజనులు ఒకింత సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గిరిజనులు జీడి పంటపైనే ఆధారపడి దానిపై వచ్చిన ఆదాయంతోనే ఏడాదంతా జీవనం సాగిస్తారు. గత రెండేళ్లుగా మంచు ప్రభావంతో పురుగు పట్టి పాడైపోయి పంట పూర్తిగా చేతికందకుండా పోయింది. ఈ ఏడాది పూత ఆశాజనకంగా ఉన్నప్పటికీ తేనె మంచు పడడం, రానున్న నెలల్లో వర్షాలని వాతావరణ కేంద్రం ప్రకటిస్తుండటంతో ఈ సంవత్సరం పంట ఎలా ఉంటుందో అని గిరిజన రైతులు ఆందోళన చెందుతున్నారు.

మండలంలో 23 పంచాయతీల్లో గిరిజన కుటుంబాలే అత్యధికంగా ఉన్నాయి. వీరంతా ప్రధానంగా వరి, చింత, పసుపు, జీడిపై ఆధారపడి జీవనం సాగిస్తారు. అయితే ప్రధానమైన వరి పంట పండినప్పటికీ ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో సరిగ్గా ధాన్యం కొనుగోలు చేయకపోవడం వల్ల దళారులను ఆశ్రయించి నష్టపోయారు.

ఆశాజనకంగా ఉన్న జీడి పూత

అయినప్పటికీ రెండో ప్రధానమైన జీడిపంట పూత బాగానే ఉండడం వల్ల వారి ఆశలు జీడిపై పెట్టుకున్నారు. మండలంలో 3250 ఎకరాల్లో గిరిజనులు జీడి సాగు చేస్తున్నారు. జీడీకి ముందస్తుగా జూన్‌లో చెట్టు చుట్టూ నీటి కుంటలు ఏర్పాటు చేసి ముందస్తుగా చెట్టు మొదలు వద్ద పురుగు సంక్రమించకుండా పిచికారి చేశారు. ఇప్పుడు జీడి పూత ఆశాజనకంగా ఉండడం వల్ల గిరిజనులు ఆ పూతను కాపాడుకునేందుకు వ్యాపారుల వద్ద వడ్డీలకు అప్పులు తీసుకొని పెట్టుబడులు పెడుతున్నారు. పూత ఇప్పుడు సక్రమంగా ఉన్నప్పటికీ పంట దశకు వచ్చేసరికి ప్రకృతి వైపరీత్యాలు, మంచు ప్రభావం వల్ల పంట చేతికి వచ్చి అప్పులు తీరుతాయో లేదోనని ఆందోళన చెందుతున్నారు.

పంట చేతికొచ్చే వరకు వేచి చూడాలి

ప్రస్తుతానికి జీడి పూత ఆశాజనకంగా ఉన్నప్పటికీ గత రెండేళ్లుగా పూతదశలో అగ్గి తెగుళు వచ్చి పంట నష్టపోయింది. ఈ ఏడాదైనా పంట బాగా పండి అప్పులు తీరుతాయని ఎదురు చూస్తున్నాం.

నిమ్మక మాణిక్యం
గిరిజన రైతు ,గొందిలోవ గ్రామం

గిరిజన గ్రామాలను షెడ్యూల్డ్ ఏరియాలో కలపండి

డిప్యూటీ సిఎం రాజన్నదొరకు వినతి

రాజన్నదొరకు సమస్యలను వివరిస్తున్న ప్రజాప్రతినిధులు, గిరిజన సంఘాల నాయకులు

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

మండల పరిధిలోగల గిరిజన పంచాయతీ లైన అడారు, డికె పట్నం, బుదురువాడ, గోచెక్క, డోకిశీల, రావికోన , వెలగవలస, సంఘంవలస, గంగాపురం, పెదమరికి గిరిజన గ్రామాలను షెడ్యూల్డ్ ఏరియాలో కలపాలని స్థానిక సంస్థల ప్రజాప్రతి నిధులు , గిరిజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి , ఉప ముఖ్యమంత్రి పీడక రాజన్న దొరను ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి వినతి అందజేశారు. స్పందించిన రాజన్న దొర మాట్లాడుతూ జీవో నెంబర్ 3పై రివ్యూ పిటీషన్ రాష్ట్ర ప్రభుత్వం తరుపున సుప్రీం కోర్టులో వేశామని, షెడ్యూల్ ఏరియాలో కలిపేందుకు కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర పతి కార్యాలయానికి పంపిందని తెలిపారు. షెడ్యూల్ ఏరియాలో కలపడం అనేది రాష్ట్ర ప్రభుత్వం చేతిలో లేదన్నారు. రాజన్నదొరను కలిసిన వారిలో గోచెక్క ఎంపిటిసి వాటక సుందరరావు, అడారు సర్పంచ్ తాడంగి దిబ్బన్న , డికె పట్నం సర్పంచ్ సీదరపు ఎర్రప్ప, బుదురువాడ సర్పంచ్ వాటక ఎర్రప్ప, రావికోన సర్పంచ్ కద్రక రామస్వామి. వెలగవలస సర్పంచ్ మెల్లిక వెంకయ్య, డికె పట్నం సచివాలయ కన్వీనర్ సీదరపు సూరయ్య, ఆరిక ప్రభాకరావు, తాడంగి సాయిబాబు, గిరిజన సంక్షేమ సంఘ నాయకులు పాల్గొన్నారు

సాంకేతిక కారణాలతో నిలిచిన రాయగడ ఎక్స్‌ప్రెస్

ప్రజాశక్తి-సీతానగరం

సాంకేతిక కారణాలతో రాయగడ-గుంటూరు ఎక్స్‌ప్రెస్ రైలు సీతానగరం రైల్వే స్టేషన్‌లో ఆదివారం 15 నిముషాలు పటు నిలిచిపోయింది. వెంటనే రైల్వే అధికారులు స్పందించి సమస్య పరిష్కరించడంతో రైలు ముందుకు కదలడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

స్టేషన్‌లో నిలిచిపోయిన రాయగడ ఎక్స్‌ప్రెస్

నిర్మించారు... నిర్వహణ మరిచారు

అధ్వానంగా ఉన్న చెత్తశుద్ధి కేంద్రం

ప్రజాశక్తి-పాలకొండ

మండలంలో నవగాం గ్రామంలో రూ.7 లక్షలతో నిర్మాణం చేపట్టిన చెత్తశుద్ధి సేకరణ కేంద్రం అస్తవ్యస్తంగా ఉంది. గ్రామాల్లో ఉన్న చెత్తను తోపుడు బండ్లతో కార్మికులు అక్కడకు తీసుకువచ్చి ఎరువుగా తయారు చేయాలి. కానీ నిర్వహణను గాలికొదిలేశారు. పూర్తిగా చెత్త నిండి అధ్వానంగా తయారైంది. దీంతో చెత్తసేకరణ కూడా జరగడం లేదని గ్రామస్తులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

పార్కులో పర్యాటకుల సందడి

బోటుషికారు చేస్తున్న చిన్నారులు

ప్రజాశక్తి-సీతంపేట

స్థానిక ఎన్‌టిఆర్ అడ్వెంచర్ పార్కులో ఆదివారం పర్యాటకుల సందడి చేశారు. పార్కులో ఉన్న అందాలను ఆశ్వాదించారు. జిల్లా నలుమూలల నుంచే కాకుండా ఇతర జిల్లాల నుండి కూడా పర్యాటకులు తరలివచ్చారు. జలవిహార్ వద్ద బోటు షికారు చేశారు. యువతి యువకులు హ్యాంగింగ్ బ్రిడ్జిపై నడిచి వెళ్లారు. ఆనంద విహార వద్ద డాన్సులు వేశారు. ఆల్ ట్రైన్ వెహికల్ ఎక్కి పార్కు చుట్టుముట్టారు. స్కై సైకిల్ ఎక్కి ఆకాశంలో చక్కర్లు కొట్టారు. . చిన్న పిల్లలు వాటర్ స్విమ్మింగ్ చేసారు. పర్యాటకులు సాహేసాపేతన క్రీడా చేసారు బుల్లి రైడర్ ఎక్కి ఆడుకున్నారు. అనంతరం మెట్టుగూడ జలపాతం లో జలకాలాడారు.

స్కై సైకిల్ తొక్కుతున్న యువతులు

సిబ్బందికి సూచనలు ఇస్తున్న డిఎస్‌పి జివి కృష్ణారావు

మరియగిరి యాత్రకు పటిష్ట బందోబస్తు

డిఎస్‌పి జివి కృష్ణారావు

ప్రజాశక్తి-వీరఘట్టం

మండలంలోని యు.వెంకంపేట పంచాయతీలో మరియగిరి కొండపైన సోమవారం జరిగే యాత్రకు పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు పాలకొండ డిఎస్‌పి జి.వి.కృష్ణారావు తెలిపారు. ఆదివారం మరియగిరి కొండను ఆయన పరిశీలించారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉండేందుకు అన్ని విధాలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇక్కడ పోలీస్ ఫిర్యాదుల విభాగం కౌంటర్ ఏర్పాటు చేశామని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఐ ఎం.హరికృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న కుసిమి సర్పంచ్ సవర కూర్మారావు

మల్లమ్మగూడలో నాలుగిళ్లు దగ్ధం

ప్రజాశక్తి-సీతంపేట

మండలంలోని కోడిశ పంచాయతీ మల్లమ్మ కొండ గూడలో శనివారం రాత్రి నాలుగు పూరిళ్లు దగ్ధమయ్యాయి. ఈ ఘటనలో సుమారు రూ.80వేల వరకు ఆస్తి నష్టం ఉంటుందని రెవెన్యూ అధికారులు అంచనా వేశారు. ఓ వృద్ధురాలు వంట చేస్తుండగా ఇంటికి నిప్పంటుకుందని గ్రామస్తులు తెలిపారు. సవర భారతి, సవర రామన్న, సవర మంగయ్య, సవర మొఖలింగం ఇళ్లు కాలిపోయాయి. ఇళ్లలో ఉన్న రూ.30వేలు నగదు, తిండి గింజలు కాలి బూడిదైనట్లు బాధితులు తెలిపారు. కుసిమి సర్పంచ్ సవర కూర్మారావు సందర్శించి బాధితులను ఓదార్చారు. తహశీల్దార్ నరసింహమూర్తి ఆదేశాల మేరకు విఆర్ఒ రవి సందర్శించి నష్టాన్ని అంచనా వేశారు.

కాలిపోతున్న గడ్డివాములు

అల్లువాడలో గడ్డివాములు దగ్ధం

ప్రజాశక్తి-జియ్యమ్మవలస

మండలంలోని అల్లువాడ గ్రామంలో ఆదివారం గడ్డివాములు దగ్ధమయ్యాయి. 15 రోజుల క్రితం కూడా ఇదే గ్రామంలో గడ్డివాములు దగ్ధమైన ఘటన మరువకముందే మళ్లీ నిప్పంటుకోవడంతో రైతులు జీర్ణించుకోలేకపోతున్నారు. సమీపంలో ఉన్నటువంటి ధాన్యాన్ని ఊరంతా కలిసి లాగేయడంతో ధాన్యం బస్తాలు అగ్నికి ఆహుతి కాలేదు. దీంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. గ్రామం సమీపంలో కల్లాలు ఉండటంతో ప్రమాదం నుంచి బయట పడినట్లు రైతులు అంటున్నారు. గడ్డివాములు దగ్ధమవడంతో పశువుల మేతకు ఇబ్బందులు పడతామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆటో నుంచి జారిపడి వ్యక్తి మృతి

శృంగవరపుకోట :ఆటోలో వెళ్తుండగా జారీ పడి అల్లు చిన్నకృష్ణ (52) ఆదివారం మృతి చెందాడు. ఎస్.ఐ. తారకేశ్వరరావు తెలిపిన వివరాలు ప్రకారం.. ధర్మవరం గ్రామానికి చెందిన చిన్నకృష్ణ ఎస్.కోట వచ్చి, తిరిగి స్వగ్రామమైన ధర్మవరం ఆటోలో వెళ్తున్నాడు. మారుతీనగర్ వద్ద గల ప్లైవుడ్ పరిశ్రమ ఎదురుగా జారి రోడ్డుపై పడి పోయి తీవ్రంగా గాయపడ్డాడు. హుటాహుటిన స్థానికులు పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించగా అతతను అప్పటికే మృతి చెందినట్లు వైద్యాధికారి నిర్ధారించారు.